## రైతులకు సాగునీరు ఇవ్వాలి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 12 : కోయిల్‌సాగర్ దిగువన వేలాది ఎకరాల్లో యాసంగిలో పంటలను పండించుకునేందుకుగానూ కోయిల్‌సాగర్ నుంచి నీరును వదిలేందుకు కలెక్టర్ రవినాయక్‌ను కలువడం జరిగిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ రవినాయక్‌ను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలిసి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు ఇవ్వాలని కోరినట్లు వారు తెలిపారు. అవసరమైతే జూరాల నుంచి మరో 1.5 టీఎంసీల వాటర్‌ను తీసుకొచ్చి రైతులకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని ఎమ్మెల్యేలు తెలియజేశారు.

## అశోక్‌నగర్‌లో చోరీ

జడ్చర్లటౌన్, డిసెంబర్ 12 : మున్సిపాలిటీ పరిధిలోని అశోక్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసముంటున్న లక్ష్మమ్మ సోమవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి పక్కింట్లో పడుకున్నది. ఈ తరుణంలో దొంగలు ఇంటి తాళాలు విరగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో దాచుకున్న రూ.20వేలు నగదుతోపాటు తులం బంగారం, 30 తులాలు వెండి అభరణాలను ఎత్తుకెళ్లారు. ఇంటి యాజమాని సుమలత మంగళవారం ఉదయం ఇంటికొచ్చి చూసేసరికి తలుపులు తెరచుకొని, ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



డాక్టర్ సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆల యువసేన నాయకులు

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), డిసెంబర్ 12 : చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ సురేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉంద్యాల గ్రామానికి చెందిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి యువసేన నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాము, ఎంకుల్, ఇబ్రహీం, మాసన్న, యోనా పాల్గొన్నారు.

## కారు బోల్తా వ్యక్తి మృతి

కొత్తకోట, డిసెంబర్ 12 : కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు నారాయణపేట జిల్లా నర్వ మండలం జంగంరెడ్డిపల్లి తండాకు చెందిన రమేశ్‌నాయక్(31) హైదరాబాద్ నుంచి కారులో తన స్వగ్రామానికి వస్తుండగా కొత్తకోట మండలం పాలెం గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున కారు అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న రమేశ్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

## నేడు ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 12 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా అండర్-14,17 బాల, బాలికల బాక్సింగ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని, విద్యార్థులు పాఠశాల బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9849650366నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## 14న ఉద్యోగ మేళా

పాలమూరు, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని నిరుద్యోగులకు ఈనెల 14వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మహమ్మద్ జానీపాషా తెలిపారు. మేళాలో థ్రెడ్జ ఐటీ టెలికాలింగ్, బస్ క్యాప్టెన్, ఫార్మాసిస్ట్, టెక్నిషియన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలిమార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కాలిబెర్‌లో బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, విర్చో పెట్రోకెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ కెమిస్ట్రీ మైక్రోబయోలజిస్ట్‌గా, కేఎల్ గ్రూప్‌లో హెల్పర్స్, సోలార్ ప్యానెల్ మ్యానిఫాక్చరింగ్, సాక్షి ఆఫీస్‌లో సేల్స్ ప్రమోటర్‌గా వివిధ రకాల కంపెనీలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న ఉదయం 10:30 గంటల వరకు ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు కార్యాలయంలో హాజరుకావాలని, వివరాలకు 9948568830, 9550205227లను సంప్రదించాలన్నారు.

# పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

◆ ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు ◆ కలెక్టర్ రవినాయక్

కోయిలకొండ, డిసెంబర్ 12 : ధరణి పోర్టల్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. ధరణి పోర్టల్ వివిధ రకాల దరఖాస్తులను పెండింగ్‌లో ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. ధరణి ఆపరేటర్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. అంతకుముందు మీసేవ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ భరత్‌గౌడ్, డిప్యూటీ తాసీల్దార్ మురళి పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

## ప్రభుత్వ భూముల జాబితాను సిద్ధం చేయాలి

◆ కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 12 : గడిచిన 10 నుంచి 15 సంవత్సరాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూముల లెక్కల జాబితాలను రూపొందించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అన్ని కొనసాగించాలని, వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం, ఇంజినీరింగ్ పనులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో అగిపోకూడదన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి ఆక్రమణలకు గురి కాలేదనే విషయా న్ని పూర్తిస్థాయిలో ధ్రువీకరిస్తూ వచ్చేవారం నివేదికను సమర్పించాలని సూచించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన పోలింగ్ సిబ్బంది డేటాను తక్షణమే సేకరించి సిద్ధం చేయాలన్నారు. అనంతరం మండల అధికారులతో వీసీ ద్వారా మాట్లాడారు. నవంబర్ పదో తేదీలోపు వచ్చిన ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. తాసీల్దార్లు ధరణిపై ప్రత్యేక దృష్టి కేంద్రికరించాలని, ఎలాంటి సమస్యలున్న పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సీఎంఆర్ రైస్ ఎందుకు ఇస్తలేరు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 12 : రైస్ మిల్లులకు సరిపోను కరెంట్ ఉంది.. నిరంతరం రైస్ మిల్లులు నడుస్తున్నా యి.. నిబంధనల మేరకు సీఎంఆర్ రైస్ ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది.. అయినప్పటికీ రైస్ మిల్లర్లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారుల సమక్షంలో రైస్ మిల్లర్ల యాజమానులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు ప్రశ్నించారు. డిసెంబర్ 31వ తేదీలోపు సీఎంఆర్ రైస్ ఇవ్వాలని ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ పెరగాలని, వెనువెంటనే సీఎంఆర్‌కు అవసరమైన స్థలం, హమాలీల సంఖ్యను మరింగా పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజు వారి సమాచారం సేకరించి నివేధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్, డీఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

## లెక్కల మాస్టర్‌కు ఘన నివాళి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), డిసెంబర్ 12 : కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన లెక్కల మాస్టర్ బేరి నాగేందర్ గత ఏడాది డిసెంబర్ 9న రోడ్డు ప్రమాదానికి గురికాగా, దవాఖాన వైద్యులు 12వ తేదీన బ్రేయిన్‌డెడ్‌గా వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన అవయవాలు దానం చేసేందుకు అనుమతి ఇవ్వడంతో, వైద్యులు బాధితుని అవయవాలను తీసి వివిధ దవాఖానల్లో ఎనిమిది మందికి అమర్చి జీవంపోశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్నేహితులు, యువకులు, విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి నాగెందర్ చిత్రపటానికి పూలమా లు వేసి నివాళులర్పించారు.

## రగ్బీ టోర్నీ విజేతగా బాలికల జట్టు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 12 : మేడ్చల్ మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ టోర్నీలో అండర్-14 విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలికల జట్టు చాంపియన్‌గా, బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది. జట్టు విజయం సాధించడం పట్ల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేష్‌బాబు, టోర్నీ పరిశీలకులు అభినందించారు.

## నిప్పంటుకొని హార్వెస్టర్ దగ్ధం

గండీడ్, డిసెంబర్ 12 : ప్రమాదవశాత్తు వరి కోత మిషన్‌కు నిప్పంటుకొని దగ్ధమైన ఘటన మండలంలోని కొండపూర్‌లో చోటు చేసుకున్నది. స్థానికులు కథనం మేరకు దోమ మండ లం ఐనపూర్‌కు చెందిన సాయి తన బంధువుల గ్రామమైన కొండాపూర్‌కు వరి కోత మిషన్‌ను వరి పంటల కోతల నిమిత్తం తీసుకువచ్చారు. మూడు రోజుల కిందట వరికోత మిషన్ పనిచేయక పోవడంతో చెట్టు కింద నిలిపి మెకానిక్ కోసం తన సొంతూరు వెళ్లారు. మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో స్థానికులు గుర్తించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. దాదాపు 50 శాతం వరి కోత మిషన్ దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. అగ్ని ప్రమాదం అనుమానస్పదంగా ఉన్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విద్యార్థులపై దృష్టి సారించాలి

◆ డీఈవో రవీందర్

పాలమూరు/నవాబ్‌పేట, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని బోయపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో రవీందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సబ్జెక్టుల్లో ఎన్ని పాఠ్యాంశాలైనయో, ప్రత్యేక తరగతులు నిర్వహణ జరుగుతుందా లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని పదో పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బడీడు పిల్లలను బడిలోనే ఉండాలని సూచించారు. అదేవిధంగా పదో తరగతి పరీక్ష ఫలితాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో రవిందర్ అన్నారు. మంగళవారం నవాబ్‌పేట మండలంలోని నవాబ్‌పేట కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్, పోమాల, కొల్లూరు, చౌడూర్ ఉన్నత పాఠశాలలను డీఈవో ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వారిపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, పరిసరాల పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కవిత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తిరుమలయ్య, సీఆర్‌పీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సత్యావతి, విజయలక్ష్మి, లలిత, జలజమేడం, వెంకటస్వామి, జ్యోతి, జీహెచ్‌ఎంలు నాగ్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేసు నమోదు

నవాబ్‌పేట, డిసెంబర్ 12 : మండలంలోని రుక్కంపల్లి గ్రామానికి చెందిన విష్ణు అనే రైతు బోరు మోటరును ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినందుకు గానూ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఆనంద్ తెలిపారు. రుక్కంపల్లికి చెందిన రైతు విష్ణు తన వ్యవసాయ పొలంలోని బావిలో ఉన్న మోటరుతోపాటు వైరును ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఏఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆటోడ్రైవర్ల అందోళన

మిడ్జిల్, డిసెంబర్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో, జీపు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మంగవారం మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం వద్ద డ్రైవర్లు సంఘం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రైవేట్ వాహనాల్లో ప్రజలు ప్రయాణించడం లేదని, దీంతో తమకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. అటో, జీపు డ్రైవర్లును ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అనంతరం తాసీల్దార్ రాజునాయక్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉన్నారు.

## శ్మశాన వాటిక ధ్వంసంపై అధికారుల విచారణ

నవాబ్‌పేట, డిసెంబర్ 12 : మండలంలోని ఇప్పటూర్ గ్రామ శివారులో రెండు రోజుల కిందట ధ్వంసం చేయబడ్డ దళితుల శ్మశాన వాటిక విషయమై మంగళవారం నవాబ్‌పేట మండలంలో మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. తమ కుటుంబీకుల సమాధులను కొంత మంది రాజకీయ నాయకులు ధ్వంసం చేశారంటూ బాధిత దళిత కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు మైనింగ్ ఏడీఈ విజయ్‌కుమార్, తాసీల్దార్ మల్లికార్జునరావు, ఏఎస్సై ఆనంద్ మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువర్గాలతో మాట్లాడుతూ రాజాపూర్, నవాబ్‌పేట మండలాల శివార్ల మధ్యలో భూమి వివాదం సమస్యగా మారిందని తాసీల్దార్ తెలిపారు. మైనింగ్, రెవెన్యూ సర్వేయర్లతో సర్వే చేయించామని.. త్వరలోనే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని తాసీల్దార్ తెలిపారు. ఇదే విషయమై ఇప్పటూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబాల సభ్యులతో కలిసి దళిత సంఘాల నాయకులు ఆనంద్, శాంతయ్య తదితరులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సమాధులు ధ్వంసం చేసిన మల్లారెడ్డిపల్లి, ఇప్పటూర్ గ్రామ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అధికారులు, ఇప్పటూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇప్పటూర్ వాగులో విచారణ చేపడుతున్న అధికారులు